ఆంధ్రజ్యోతి

5

ANDHRAJYOTHY



అనంతపురం
జిల్లా వార్తలు

బుధవారం 28 ఫిబ్రవరి 2024

ఘనమైన పేరు..! అంతకంటే ఘనమైన చరిత్ర..! అశోకుడి కాలంలో బంగారు నాణేలను ముద్రించే టంకశాల ఇక్కడే ఉండేది. ఎందరో యువరాజులకు యుద్ధ విద్య నైపుణ్య శిక్షణాలయం ఇది. శత్రు దుర్భేద్యమైన కోట. రామపాదం సోకి.. రాయి వనితగా మారినచోటూ ఇదే..! పౌరాణికంగా.. చారిత్రకంగా ఎంతో ఖ్యాతిగడించిన ప్రాంతం.. గుత్తి. ఇది ఒకనాటి గౌతమీ పురం. ఇప్పుడు అక్కడ జనం కోసమే జనం ఉంటున్నారు. ఎలాంటి ఉపాధీ లేదు. ఒకప్పుడు నియోజకవర్గ కేంద్రం అన్న పేరైనా ఉండేది. పునర్వ్యవస్థీకరణలో ఆ గోచీ కూడా ఊడిపోయింది. కానీ ఒక్కటి ఉండేది..! రైల్వే జంక్షన్..! కాస్తో కూస్తో ఉపాధి కల్పించేది. అది కూడా పోయింది..! ఉన్న రైళ్లన్నీ దారి మళ్లాయి. ప్రజల ఉపయోగం కంటే.. ఇంధన పొదుపునకే రైల్వే శాఖ ప్రాధాన్యం ఇచ్చింది. అది గౌతమీపురవాసులకు శాపంగా మారింది.

పాపం... గుత్తి..!

పేరుకే రైల్వే జంక్షన్

- ఉన్న రైళ్లన్నీ దారి మళ్లింపు
- బైపాస్ లైన్‌తో మరో రైలు కోత
- గుత్తి ఆర్‌ఎస్‌లో దెబ్బతిన్న వ్యాపారాలు
- కాంట్రాక్టు రద్దు చేసుకుని వెళ్లిన క్యాటరర్
- ఊరికి దూరంగా గుత్తి కోట స్టేషన్
- ఆన్‌లైన్‌లో వెతికినా కనిపించదు..
- అది కోట స్టేషన్ కాదు.. ఫోర్ట్ క్యాబిన్..!



గుత్తి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారాలు



ఆన్‌లైన్‌లో 'గుత్తి ఫోర్ట్ స్టేషన్' అని కాకుండా.. 'గుత్తి బైపాస్ క్యాబిన్' అని చూపుతోంది ఇలా..


జనమే లేని గుత్తి కోట రైల్వే స్టేషన్

గుంతకల్లు/గుత్తి, ఫిబ్రవరి 27: రైళ్ల రాకపోకలతో సందడిగా ఉండే గుత్తి రైల్వే జంక్షన్ కళావిహీనమైంది. గుంతకల్లు-ఖాదర్‌పేట-కల్లూరు డబుల్ లైన్ కారణంగా పలు రైళ్లను గుత్తి మీదుగా రాకుండా చేశారు. బైపాస్ లైన్ కారణంగా గత సంవత్సరంలో మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్ రైళ్లను కూడా గుత్తి స్టేషన్‌కు రాకుండా చేశారు. 'గుత్తి పట్టణవాసుల సౌకర్యార్థం.. గుత్తికోట రైల్వేస్టేషన్' అని ఊదరగొట్టిన రైల్వే అధికారులు.. ఆ స్టేషన్‌కు ఒక రైలునే కేటాయించారు. గుత్తి పట్టణానికి 2 కి.మీ. దూరంలో దీన్ని నిర్మించారు. ఇది ప్రజలకు ఏమాత్రం అనువుగా లేదు. గుత్తి పట్టణానికి సమీపంలో 'గౌతమపురి' పేరిట హాల్ట్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. కానీ బైపాస్ లైన్‌మీద, ప్రజలకు ఉపయోగపడనిచోట దీన్ని నిర్మించారు. అక్కడ కేవలం ఒక ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్ రైళ్లను మాత్రమే నిలుపుతున్నారు. కోట్లు వెచ్చించి కట్టిన ఈ స్టేషన్‌కు 'గుత్తి కోట స్టేషన్' అని బోర్డు పెట్టారేగానీ.. ఆన్‌లైన్ మాత్రం ఈ పేరుతో వెదికితే వివరాలు కనిపించవు. ఆన్‌లైన్‌లో 'ఫోర్ట్ క్యాబిన్' అని చూపించారు.

మళ్లిపోయిన రైళ్లు

గుంతకల్లు-ఖాదర్‌పేట-కల్లూరు డబ్లింగ్ లైన్ కారణంగా ఆ రూటు ట్రాఫిక్ సామర్థ్యం పెరిగింది. గుత్తికి వెళ్లకుండా నేరుగా తీసుకెళ్తే దాదాపు 25 కి.మీ. దూరం తగ్గుతుంది. ఇలా చేస్తే ఇంధనం పొదుపు అవుతుందని గుత్తి మీదుగా వెళ్లే రైళ్లను ఒక్కొక్కటిగా ఖాదర్‌పేట్ మీదుగా మళ్లించారు. గతంలో గుత్తి మీదుగా వెళ్లే కేకే ఎక్స్‌ప్రెస్ (నెం. 12627/28), కుర్లా ఎక్స్‌ప్రెస్ (నెం. 11013/14), బసవ ఎక్స్‌ప్రెస్ (నెం. 17308/07), బీదర్ ఎక్స్‌ప్రెస్ (16578/79), ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్ (నెం. 11301/02), హంపి ఎక్స్‌ప్రెస్ (నెం. 16591/92), అహ్మదాబాద్ ఎక్స్‌ప్రెస్ (నెం. 22690/91) రైళ్లను కల్లూరు-గుంతకల్లు లైన్ ద్వారా పంపుతున్నారు. బెంగళూరు-తిరుపతి రైల్వే మార్గాలను కలుపుతూ నిర్మించిన బైపాస్ లైన్‌పై గుత్తి కోట రైల్వే స్టేషన్‌ను నిర్మించారు. గుత్తిలో నిలిచే ధర్మవరం-మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్ (నెం. 17215/16) రైలును జంక్షన్‌లోనికి రానివ్వకుండా, గుత్తి కోట స్టేషన్‌లో హాల్ట్ కల్పించారు. ఇలా వివిధ కారణాలతో గుత్తికి వచ్చే రైళ్ల సంఖ్య తగ్గిపోయింది. స్టేషన్‌లో వ్యాపారాలు లేకుండా పోయాయని స్టాల్స్ నిర్వాహకులు వాపోతున్నారు. కేరళకు చెందిన ఓ క్యాటరింగ్ స్టాల్ నిర్వాహకుడు తన కాంట్రాక్టును అర్ధంతరంగా రద్దుపరచుకుని వెళ్లిపోయాడంటే.. ఇక్కడి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

కోట స్టేషన్‌కు కష్టాలు

గుత్తి పట్టణానికి రైల్వే స్టేషన్ దూరంగా ఉందని, గుంతకల్లు రోడ్డులో.. రైలు వంతెన పక్కన ఓ హాల్ట్ స్టేషన్‌ను నిర్మించాలని స్థానికులు ఎన్నో ఏళ్ల నుంచి కోరుతున్నారు. పట్టణవాసులు కోరిన చోట రైల్వే అధికారులు సర్వే చేశారు. భూసేకరణ వీలుకాలేదని తెలిపి ఆ ప్రతిపాదనకు తిలోదకాలిచ్చారు. బైపాస్ లైన్ నిర్మాణ సమయంలో సరుకు రవాణా రైళ్ల అవసరార్థం గుత్తి కోట స్టేషన్‌ను నిర్మించారు. అక్కడ కేవలం ఒక రైలును నిలుపడానికి మాత్రమే అనుమతినిచ్చారు. మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్ రైళ్లు పగటి వేళ ఈ స్టేషన్‌కు వస్తుంటాయి. అయినా, కర్నూలు రోడ్డులోని ఈ స్టేషన్ నుంచి ఇళ్లకు చేరడానికి సరైన రవాణా సదుపాయం లేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. స్టేషన్‌కు ఎలాగోలా వెళ్లగలుగుతున్నారుగాని, రైలు దిగి గుత్తి పట్టణంలోకి రావాలనుకున్న వారికి సమస్యలు ఎదురౌతున్నాయి.

ఈ రైళ్లనైనా ఆపండి..

మళ్లింపుల కారణంగా గుత్తి స్టేషన్‌కు రైళ్లు తగ్గిపోయాయి. ఇక్కడ నిలవకుండా వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లనైనా ఆపి.. ప్రయాణికులకు ఉపయోగపడేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం జైపూర్ ఎక్స్‌ప్రెస్ (నెం. 12976/75), ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ (నెం. 12708/09), అమరావతి ఎక్స్‌ప్రెస్ (నెం. 12765/66), మధురై ఎక్స్‌ప్రెస్ (నెం. 22715/16), జబల్పూర్ ఎక్స్‌ప్రెస్ (12194/95) రైళ్లు గుత్తి మీదుగా వెళ్తున్నాయి. కానీ ఆగడం లేదు. వీటిని ఆపినా తమకు ఉపయుక్తంగా ఉంటుందని స్థానికులు అంటున్నారు. విశాఖపట్టణం-కడప మధ్య తిరుగుతున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ (నెం. 17487/88) రైలును గుత్తి మీదుగా గుంతకల్లు వరకూ పొడిగించాలని గుంతకల్లు నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.



అవస్థలు పడుతున్నాం..

గతంలో గుత్తి నుంచి ఢిల్లీ, షిరిడీకి వెళ్లడానికి అనుకూలంగా ఉండేది. రైళ్ల మళ్లింపు కారణంగా గుంతకల్లుకు వెళ్లి ఎక్కాల్సి వస్తోంది. మార్పుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రైల్వే శాఖ అధికారులు స్పందించి, గుత్తిలో ఆపకుండా వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లను రెండు నిమిషాలు ఆగేలా చూడాలి.

- మహబూబ్ బాషా, ప్రయాణికుడు, గుత్తి



రైళ్ల మళ్లింపుతో ఇబ్బందులు..

రైళ్లను కల్లూరు-గుంతకల్లు రూటులోకి మళ్లించడంతో గుత్తి రైల్వే స్టేషన్‌కు ప్రయాణికులు రావడం తగ్గిపోయింది. దూర ప్రాంతాలకు వెళ్లాలంటే గుంతకల్లుకు వెళ్లి రైలు ఎక్కాల్సి వస్తోంది. గుత్తి మీదుగా వెళ్లే రైళ్లను మళ్లించడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. యశ్వంతపూర్-విజయవాడ ప్యాసింజరు రైలును పునరుద్ధరించాలి. మచిలీపట్నం రైలును గుత్తి స్టేషన్‌కు తీసుకురావాలి.

- జీఎం బాషా, డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు



జీవనోపాధి దెబ్బతింది..

గుత్తి మీదుగా వెళ్లే రైళ్లను దారిమళ్లించారు. దీంతో స్టేషన్‌లో క్యాటరింగ్ స్టాల్స్ వ్యాపారాలు తగ్గిపోయాయి. మా జీవనోపాధి దెబ్బతింది. తక్కువ రైళ్ల కారణంగా వ్యాపారాలు దెబ్బతిని నష్టాలు వస్తున్నాయి. మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్‌ను కూడా గుత్తి కోట స్టేషన్‌కు మార్చారు. ప్రయాణికులు గుత్తి స్టేషన్‌కు రావడం లేదు.

- శ్రీనివాసులు, స్టేషన్ హాకర్

నీటి పోరాటం

- నగరపాలికను ముట్టడించిన జనం
- నేతృత్వం వహించిన వైసీపీ కార్పొరేటర్లు


నగరపాలక సంస్థ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ప్రజలు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 27: తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నగర ప్రజలు నగరపాలక సంస్థ కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించారు. ఈ ఆందోళనకు అధికార పార్టీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు, ఓ మాజీ కార్పొరేటర్ నేతృత్వం వహించారు. నగరంలో 50 డివిజన్లకుగానూ 48 డివిజన్లలో వైసీపీని ప్రజలు గెలిపించారని, అలాంటి వారికి గుక్కెడు తాగునీరు ఇవ్వలేరా అని మండిపడ్డారు. 23వ డివిజన్ కార్పొరేటర్ హరిత, ఆమె భర్త, మాజీ కార్పొరేటర్ జయరాం నాయుడు, 12వ డివిజన్ కార్పొరేటర్ బాబా ఫక్రుద్దీన్ నేతృత్వంలో వందలాది మంది నగరపాలిక ఎదుట బైఠాయించారు. కుండలు, ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఇంత పెద్ద కార్పొరేషన్‌లో రెండు మోటార్లకు మరమ్మతు చేయించలేరా అని కార్పొరేటర్లు ప్రశ్నించారు. 'మీకు చేతకాకుంటే చెప్పండి.. చందాలు వేసుకుని.. జోలెపట్టి అడుక్కుని కొత్త మోటార్లను కొనిస్తాం..' అని మండిపడ్డారు. రూ.10 విలువైన చెట్లను రూ.వెయ్యికి కొని.. బిల్లులు పెట్టుకున్నారని, ఉన్న రోడ్డుమీదే రోడ్డు వేసి డబ్బులు కాజేస్తున్నారని, కానీ తాగునీటి సమస్య పరిష్కారానికి మాత్రం డబ్బులు లేవని సాకులు చెబుతున్నారని విమర్శించారు. ఆందోళనకు దిగేతే పార్టీ పరువు పోతుందని ఇన్నాళ్లూ ఓపిక పట్టామని, ఇకపై ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఓటు కోసం వస్తే చెప్పుతో కొడతాం అని ఓ మహిళ హెచ్చరించారు. అనంతరం లోపలికి చొరబడి కమిషనర్ చాంబర్‌ను ముట్టడించారు. కమిషనర్ మేఘస్వరూప్‌కు సమస్యను వివరించారు. మోటార్ల మరమ్మతుకు పది రోజుల సమయం పడుతుందని, వచ్చే నెల పదో తేదీలోగా సమస్యను పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఆ తరువాత కాసేపటికి మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య అధికారులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. పదో తేదీలోగా నీటి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు.

ఐదు నెలలుగా సమస్య..



విజయనగరకాలనీకి ఐదు నెలలుగా నీరు రావడం లేదు. ఎమ్మెల్యే సహా అందరికీ ఫోన్ చేశాం. ఇదిగో వస్తాయి.. రేపు వస్తాయని అంటారు. ఓట్ల కోసం అందరూ వస్తారు. మా సమస్యలను పట్టించుకోరు. అడుక్కునేవారి మాదిరి కలెక్టర్ ఆఫీస్ వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నాం. మా కాలనీలోనే సర్పంచ్ ఉంటారు. పట్టించుకోరు. కాళ్లు చేతులు పట్టుకుంటే ఒక ట్యాంకు, రెండు ట్యాంకులు పంపిస్తారు. ఇప్పుడే ఇలా ఉంటే.. వేసవిలో పరిస్థితి ఏమిటి..?

- సాదాకిని, విజయనగరకాలనీ

స్పందన లేదు..



ఆరునెలల నుంచి నీరు రావడం లేదు. అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. బోరు నీటి వసతి కూడా లేదు. ఇంతమంది ఇక్కడికి వచ్చినా అధికారులు స్పందించడం లేదంటే ఏం చేయాలో అర్థం కావడం లేదు. సమస్య పరిష్కారమయ్యేవరకూ ఇలాంటి ధర్నాలు చేయక తప్పదు. తాగడానికి ఫిల్టర్ నీరు కొనాలంటేనే ఇబ్బంది. అలాంటిది ఇతర అవసరాలకు ఎన్నని కొనగలం..?

- సునీత, అనంతసాగర్‌కాలనీ

లంచం తీసుకుని దొరికాడు

ఏసీబీ వలలో పామిడి ఆర్ఐ


ఏసీబీ అదుపులో ఆర్ఐ క్రాంతికుమార్ (కూర్చున్న వ్యక్తి)

పామిడి, ఫిబ్రవరి 27: ఏసీబీ అధికారులు పామిడి తహసీల్దార్ కార్యాలయంపై మంగళవారం దాడులు నిర్వహించారు. మ్యుటేషన్ కోసం రైతు నుంచి లంచం తీసుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పామిడి మండలంలోని అనుంపల్లి గ్రామ రైతు శేషాద్రి ఫిర్యాదు చేయడంతో ఈ దాడులు నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి తెలిపిన మేరకు, తన భూమిని తన భార్య జయలక్ష్మి పేరిట, తన సోదరుడు సుంకయ్య భూమిని ఆయన భార్య గంగేశ్వరి పేరిట బదలాయించాలని (మ్యుటేషన్) తహసీల్దారు కార్యాలయంలో శేషాద్రి దరఖాస్తు చేసుకున్నారు. భూమి బదలాయింపునకు ఒక్కొక్కరు రూ.5 వేలు ఇవ్వాలని ఆర్ఐ డిమాండ్ చేశాడు. ఒక్కొక్కరు రూ.3 వేలు ఇస్తామని శేషాద్రి ఒప్పందం చేసుకుని, లంచం ఇవ్వడం ఇష్టం లేక ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి సూచన మేరకు తహసీల్దారు కార్యాలయంలో ఆర్ఐకి రైతు రూ.6 వేలు లంచం ఇచ్చారు. ఆ నోట్లను ఆర్ఐ క్రాంతి కుమార్ తన ప్యాంటు జేబులో పెట్టుకున్నారు. ఆ వెంటనే ఏసీబీ అధికారులు దాడులు చేసి, లంచం సొమ్మును రికవరీ చేశారు. ఆర్ఐని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

చెరువుకు నీటి కరువు

- హంద్రీనీవా నీటిని వదలని అధికారులు
- ఆందోళన చెందుతున్న బండమీదపల్లి రైతులు


బండమీదపల్లి చెరువులో అడుగంటిన నీరు

రాప్తాడు, ఫిబ్రవరి 27: వైసీపీ అధికారంలోకి వచ్చాక బండమీదపల్లి చెరువుకు నీరు చేరడం గగనమైంది. పాలకుల నిర్లక్ష్యంతో చెరువు ఎండిపోతోంది. రాప్తాడు మండలంలోని పెద్ద చెరువుల్లో బండమీదపల్లి చెరువు ఒకటి. పీఏబీఆర్ కుడి కాలువ ఈ చెరువుకు 3 కి.మీ. దూరంలో ఉంది. కానీ కాలువ కంటే చెరువు ఎత్తైన ప్రదేశంలో ఉండటంతో నీరు చేరడం లేదు. ఈ సమస్య పరిష్కారానికి టీడీపీ హయాంలో నాటి మంత్రి పరిటాల సునీత చొరవ తీసుకున్నారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి హంద్రీనీవా కాలువ నుంచి చెరువుకు నీరు తరలించేందుకు నిధులు మంజూరు చేయించారు. కనగానపల్లి మండలం కోనాపురం సమీపంలో ఉన్న హంద్రీనీవా కాలువ నుంచి బండమీదపల్లి చెరువు వరకూ పిల్ల కాలువను తవ్వించేందుకు రూ.8 కోట్లు విడుదల చేయించారు. పరిటాల సునీత ప్రత్యేక చొరవతో పిల్లకాలువ పనులు వేగంగా పూర్తి అయ్యాయి. హంద్రీనీవా నీటితో చెరువును నింపి.. మరువ పారించారు. దీంతో బోర్లలో భూగర్భ జలాలు పెరిగాయి. బీడు భూములు సాగులోకి వచ్చాయి.

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం..

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెరువకు కష్టాలు మొదలయ్యాయి. వర్షపు నీటికితోడు హంద్రీనీవా నుంచి వచ్చే అరకొర నీటితో చెరువు సగమే నిండుతోంది. మూడు నెలల నుంచి హంద్రీనీవా కాలువలో నీరు పారుతోంది. పిల్ల కాలువ ద్వారా కొన్ని రోజులు చెరువుకు నీటిని వదిలారు. ఆ నీరు చెరువులో గుంతలకే సరిపోయింది. ఆ తరువాత నీటి సరఫరా నిలిచిపోయింది. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు ఎవరూ చెరువు గురించి పట్టించుకోలేదు. అరకొరగా సరఫరా అయిన నీరు ఇప్పటికే అడుగంటింది.

తగ్గుతున్న భూగర్భజలాలు

గత ప్రభుత్వంలో చెరువుకు నీరు చేరడంతో బండమీదపల్లి, యర్రగుంట, పాలబావి గ్రామాల్లో చాలామంది రైతులు బోర్లు తవ్వించారు. వాటిలో నీరు పుష్కలంగా వచ్చేది. కానీ పరిస్థితి మారిపోయింది. వర్షాలు లేక, వైసీపీ నాయకులు హంద్రీనీవా నీరు విడుదల చేయించక.. చెరువు ఎండిపోతోంది. బోర్లలో నీరు రోజు రోజుకూ తగ్గిపోతోంది. వచ్చే ఖరీఫ్‌లో వర్షాలు బాగా కురిస్తే తప్ప తాము కోలుకునే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హాస్టళ్లలో ఆకలి కేకలు

- డైట్ బిల్లులు చెల్లించని ప్రభుత్వం
- అందని సీఎఫ్ఎంఎస్ టోకెన్ నంబర్లు
- రూ.కోట్లలో పేరుకుపోయిన బకాయిలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 27: డైట్ బిల్లులు నెలల తరబడి పెండింగ్ ఉండటంతో సంక్షేమ వసతిగృహాల వార్డెన్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం టోకెన్ నంబర్లను కూడా ఇవ్వడం లేదు. ఒక్కో సంక్షేమశాఖలో నాలుగైదు నెలలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో మెనూను అమలు చేయడం వార్డెన్లకు తలకుమించిన భారమవుతోంది. ఎస్సీ సంక్షేమశాఖ పరిధిలో నవంబరు నుంచి డైట్ బిల్లులు అందాల్సి ఉంది. బిల్లులన్నీ అప్‌లోడ్ చేసినా ఒక్కటీ మంజూరు కాలేదని వార్డెన్లు లబోదిబోమంటున్నారు. బీసీ సంక్షేమశాఖలో డిసెంబరు నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏబీసీడబ్ల్యూలు, జిల్లాస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు బిల్లులు ప్రభుత్వానికి పంపుతున్నా.. నిధులు విడుదల చేయడం లేదు. హాస్టళ్లకు అందాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు మళ్లించినందుకే ఈ పరిస్థితి ఏర్పడిందన్న ఆరోపణలు ఉన్నాయి. డైట్ బిల్లుల చెల్లింపు మరింత ఆలస్యం కాకతప్పదన్న అభిప్రాయం ఆయా శాఖల అధికారుల నుంచి వ్యక్తమవుతోంది. డిసెంబరు వరకూ బిల్లులు అప్‌లోడ్ చేశారు. టోకెన్ నంబర్లు ఇవ్వకపోవడంతో జనవరి నుంచి బిల్లులు అప్‌లోడ్ చేయలేకున్నారు. సీఎఫ్ఎంఎస్ నుంచి టోకెన్ నంబర్లు విడుదల చేస్తేనే వార్డెన్లు బిల్లులు సబ్‌మీట్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే ఈ ప్రక్రియ మొత్తం ఆగిపోతుందని, కొత్త ప్రభుత్వం ఏర్పడేదాకా బిల్లుల కోసం ఆగాల్సి వస్తుందని అధికారులు, వార్డెన్లు ఆందోళన చెందుతున్నారు.

రూ.కోట్లలో బకాయిలు

జిల్లాలో 58 బీసీ హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో 7,329 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఈ హాస్టళ్లన్నింటికీ డిసెంబరు నుంచి డైట్ బిల్లులు రావాల్సి ఉంది. మరికొన్ని డివిజన్లలో సాంకేతిక సమస్యలతో నవంబరు నుంచి బిల్లులు రావాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా బీసీ హాస్టళ్లకు రూ.6 కోట్లకు పైగానే బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఎస్సీ సంక్షేమశాఖ పరిధిలో జిల్లా వ్యాప్తంగా 58 హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో 4,927 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. కొన్నిచోట్ల నవంబరు నుంచి, మరికొన్ని చోట్ల అక్టోబరు నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. రూ.5 కోట్లకు పైగానే బకాయిలు ఉన్నాయని అధికారులు అంటున్నారు.

ఆకలి బాధలు పట్టవా..?



ప్రైవేట్ స్కూళ్లలో చదివించలేని పేదలు మాత్రమే తమ బిడ్డలను సంక్షేమ హాస్టళ్లలో చేర్పిస్తున్నారు. ఇలాంటి వారి ఆకలి బాధలు ప్రభుత్వానికి పట్టవా..? డైట్ బిల్లులను సకాలంలో చెల్లించకపోతే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం కష్టంగా మారుతుంది. వెంటనే ప్రభుత్వం పెండింగ్ డైట్ బిల్లులను రిలీజ్ చేయాలి.

- పరమేష్, జిల్లా ప్రధానకార్యదర్శి, ఎస్ఎఫ్ఐ

రావాల్సి ఉంది..

జనవరి వరకూ డైట్ బిల్లులను పంపాం. తాడిపత్రి డివిజన్‌లో మాత్రమే సాంకేతిక కారణాల వల్ల కొన్ని హాస్టళ్లకు నవంబరు నుంచి, మరికొన్ని హాస్టళ్లకు డిసెంబరు నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మిగిలిన అన్ని చోట్ల డైట్ బిల్లులకు సంబంధించిన నివేదికలను పంపాం. ఈ నెల నుంచి టోకెన్ నంబర్లు సీఎఫ్ఎంఎస్ రావాల్సి ఉంది. టోకెన్ నంబర్లు రిలీజ్ చేస్తే డైట్ బిల్లులను అప్‌లోడ్ చేసి పంపుతాం.

- కుష్బూకొఠారి, డీడీ, బీసీ సంక్షేమశాఖ

మట్టి కొడుతున్నారు..



పరీక్షల సమయంలో హాస్టల్ విద్యార్థులకు సరైన భోజనం అందడం లేదు. డైట్ బిల్లులు పెండింగ్ ఉంచిన కారణంగా వార్డెన్లు అప్పుల కోసం తిప్పలు పడుతున్నారు. 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులు ఉదయం టిఫిన్ తినకుండా తరగతులకు వెళుతున్నారు. పెండింగ్‌లో ఉన్న డైట్ బిల్లులను రిలీజ్ చేయాలి.

- సురేష్ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య

మార్చిలో రాగిపిండి పంపిణీ

పుట్టపర్తి, ఫిబ్రవరి 27 : రేషన్ కార్డుదారులకు మార్చి నెలలో కిలో రాగిపిండిని రూ.11 చొప్పున పంపిణీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో కార్డుదారుడికి ఉచిత బియ్యంతో పాటు కిలో రాగులను ఉచితంగా పంపిణీ చేయాలని, వీటితో పాటు కిలో రాగిపిండిని రూ.11కు పంపిణీ చేయాలని ఆదేశాలు వచ్చాయని, కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు పీఎం కిసాన్, సున్నా వడ్డీ సొమ్ము విడుదల

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 27: పీఎం కిసాన్, సున్నా వడ్డీ సొమ్మును బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం జగన్ మోహన్‌రెడ్డి విడుదల చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24 సంవత్సరం మూడో విడతలో 2.94 లక్షల మంది రైతులకు రూ.59.01 కోట్ల పీఎం కిసాన్ సొమ్ము, 2021-22 రబీ, 2022-23 ఖరీఫ్ సీజన్లకు సంబంధించి 83,534 మంది రైతులకు రూ.17.25 కోట్ల సున్నా వడ్డీ సొమ్ము నేరుగా జమ చేస్తారన్నారు.

రేపు ఏపీటీఎఫ్ నిరసనలు


పోస్టర్ విడుదల చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 27 : ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఈనెల 29న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన చేపట్టనున్నట్లు ఏపీటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఉపాధ్యాయభవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ... ఈనెల 27న జరగాల్సిన చలో విజయవాడను ఏపీ జేఏసీ అర్ధంతరంగా వాయిదా వేసిందన్నారు. దీన్ని ఏపీటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని వ్యతిరేకిస్తూ ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లతో కలిసి నిరసన చేపడ్తామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, ఉపాధ్యక్షులు సతీష్, ఓబులేసు, రాష్ట్ర కౌన్సిలర్లు సర్దార్ వలి, వెంకటరమణ, ఇతర నాయకులు వన్నప్ప, శ్రీనివాసులు, మహేష్, రామూర్తి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

లోకల్ ఆఫీసర్లకే పట్టం!

- ఎన్నికల వేళ ఫెవికాల్ వీరులకు అగ్రస్థానం
- మూడేళ్ల నిబంధనలు మూలకు..
- ఇటీవల 8 మండలాల్లో ఇన్‌చార్జ్‌లకు అవకాశం
- మూడు, నాలుగేళ్లున్న వాళ్లకే ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాధ్యతలు
- ఎమ్మెల్యేల 'అధికార' ముద్రకు ఆమోదమా..?




జడ్పీ కార్యాలయం

అనంతపురం విద్య, ఫిబ్రవరి 27: ఎన్నికలు పారదర్శకంగా జరగాలంటే పాత అధికారులు పోవాలి. కొత్త అధికారుల రావాలి. అప్పుడే పక్షపాతం లేకుండా, అధికార పక్షానికి అంటకాగకుండా ఎన్నికలు సాగుతున్నాయన్న నమ్మకం ఉంటుంది. అందుకే ఎన్నికల సంఘం కూడా ఎన్నికల వేళ పాత వారికి బై..బై చెప్పి కొత్త అధికారులను దించుతుంది. ముఖ్యంగా ఎన్నికల విధుల్లో ఉండే అధికారులు ఒకే చోట మూడేళ్ల పని చేసి ఉంటే వారందరినీ బదిలీ చేయమని ఆదేశాలిస్తుంది. అయితే మన జిల్లా అధికారులు మాత్రం ఇటీవల ఎఫ్ఏసీ బాధ్యతలంటూ...స్థానికంగా మూడేళ్లు, నాలుగేళ్లు ఉన్న వారికీ పట్టం కట్టడంపై విమర్శలు వస్తున్నాయి. నాలుగైదేళ్లు స్థానికంగా మండలాల్లో ఉన్న ఈఓఆర్డీలకు ఎంపీడీఓలుగా ఎఫ్ఏసీ బాధ్యతలు ఇవ్వడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యేల ఆమోదంతోనే జిల్లా అధికారులు వారికి ఎంపీడీఓలుగా ముద్ర వేసి నియమించారన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఎనిమిది మండలాలకు ఎఫ్ఏసీలే దిక్కు

లోక్‌సభ, ఏపీ అసెంబ్లీ ఎన్నికలు నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో మూడేళ్లు ఒకేచోట పని చేసిన ఎంపీడీఓలను కర్నూలు, కడప జిల్లాలకు బదిలీ చేశారు. జిల్లా నుంచి సుమారు 38 మందిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. ఇతర జిల్లాల నుంచి ఉమ్మడి జిల్లాకు 36 మంది ఎంపీడీఓలను నియమించారు. ఈ మేరకు గత నెలలో పీఆర్ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. అయితే ఇతర జిల్లాల నుంచి అనేక కారణాల వల్ల కొందరు ఎంపీడీఓలు ఈ జిల్లాకు రాకపోవడంతోపాటు, ఇతర కారణాలతో జిల్లా వ్యాప్తంగా 8 మండలాల్లో ఎంపీడీఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఆయా మండలాల్లో పని చే


గార్లదిన్నె ఎంపీడీఓ కార్యాలయం

స్తున్న ఈఓఆర్డీలు, ఏఓలకు జిల్లా అధికారులు ఎంపీడీఓగా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే దీని వెనుక అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల ప్రమేయం ఉందన్న విమర్శలు వస్తున్నాయి.


ఏళ్ల తరబడి తిష్టవేసినోళ్లకే...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8 మండలాల్లో ఎంపీడీఓ పోస్టులు ఖాళీగా ఉండటంతో... అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, ఈఓఆర్డీలతో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేశారు. బొమ్మనహాళ్, కణేకల్లు, గార్లదిన్నె, అమడగూరు, కొత్తచెరువు, చిలమత్తూరు, రొద్దం, రొళ్ల మండలాలకు స్థానికంగా, పక్కనున్న మండలాల్లో ఉన్న ఏఓలు, ఈఓఆర్డీలనే ఎంపీడీఓ(ఎఫ్ఏసీ)లుగా నియమిస్తూ ఈ నెల 8న జడ్పీ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. రాయదుర్గం నియోజకవర్గంలోని ఓ మండలానికి చెందిన ఓ ఈఓఆర్డీ సుమారు నాలుగేళ్లుగా పనిచేస్తున్నా ఎంపీడీఓగా నియమించారు. శింగనమల నియోజవకర్గంలోని ఓ మండలానికి చెందిన ఈఓఆర్డీ సైతం ఐదేళ్లుగా అదే మండలంలో విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలుస్తోంది. ఆ ఈఓఆర్డీని ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా నియమించారు. పుట్టపర్తి నియోజవకర్గంలోని ఓ మండలానికి పక్క మండలంలో సుమారు ఐదేళ్లుగా పనిచేస్తున్న ఓ ఈఓఆర్డీని నియమించడంపై విమర్శలు వస్తున్నాయి. ధర్మవరం నియోకవర్గంలోని ఓ మండలానికి మూడేళ్లకు పైగా పనిచేసిన అనుభవం ఉన్న ఈవోఆర్డీని, పెనుకొండ నియోజకవర్గంలోని ఓ మండలానికి సైతం 4 ఏళ్లుగా పనిచేస్తున్న ఈఓఆర్డీని ఎంపీడీఓగా వేయడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాలుగైదేళ్ల నుంచి పనిచేస్తున్న ఈఓఆర్డీలు స్థానిక అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే పనిచేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల వేళ వారినే ఎంపీడీఓలుగా నియమిస్తూ...జడ్పీ అధికారులు ఉత్తర్వులు ఇవ్వడం, వాటి ఆధారంగా వారినే ఎన్నికల ప్రవర్తనా నియామావళి (ఎంసీసీ) అమలు చేసే అధికారులుగా నియమిస్తూ ఈ నెల 15న జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇవ్వడంపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడేళ్ల నిబంధనలను తుంగలో తొక్కడంపై విమర్శలు వస్తున్నాయి.

ఉల్లి రైతు కంట కన్నీరు



- నాలుగు నెలల క్రితం ప్యాకెట్ ధర రూ.2,200
- ప్రస్తుతం రూ.500కు పడిపోయిన వైనం
- అప్పులపాలవుతామంటున్న రైతులు


ఉల్లి గడ్డలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

అనంతపురం అర్బన్/యాడికి , ఫిబ్రవరి 27 : ఉల్లి రైతు కంట కన్నీరు కారుతోంది. ధర అమాంతం పడిపోవడంతో అన్నదాతలు భారీగా నష్టపోతున్నారు. పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 600 ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశారు. యాడికి, రాయదుర్గం, గుంతకల్లు తదితర ప్రాంతాల్లో బోరుబావుల కింద ఉల్లి పంట అధికంగా సాగు చేశారు. పంట సాగుకు ఎకరాకు రూ.50వేల నుంచి రూ.80వేల దాకా పెట్టుబడి ఖర్చు అవుతుంది. పంట బాగా పండితే ఎకరాకు 200 నుంచి 400 ప్యాకెట్ల వరకు దిగుబడి వస్తుంది. ఈ సారి జిల్లాలోని కొందరు రైతులకు ఎకరాకు 150 నుంచి 180 ప్యాకెట్ల దాకా దిగుబడి వచ్చింది. మరి కొందరికి 190 నుంచి 200 ప్యాకెట్ల వరకు దిగుబడి వచ్చింది. దిగుబడి ఉన్నా ధర లేక అన్నదాతకు ఆవేదన తప్పడం లేదు.

నాలుగు నెలల్లో పడిపోయిన ధరలు



నాలుగు నెలల క్రితం ఉల్లి ప్యాకెట్ (50కేజీలు) రూ.2,200 పలికింది. ఆ తర్వాత రూ.1600 నుంచి రూ.1800 వరకు ఉండేది. ప్రస్తుతం ప్యాకెట్ ఉల్లి ధర రూ.500కు పడి పో యింది. స్థానికంగా గిట్టుబాటు కాకపోవడంతో కొందరు రైతులు చెన్నైమార్కెట్‌కు తరలిస్తున్నారు. మరికొందరు పొలాల వద్దనే దళారులకు అమ్మేస్తున్నారు. మరోవైపు ధర పెరగకపోతుందా అనే ఆశతో కొందరు నిల్వ చేసుకుంటున్నారు.

ధర పతనంతో నష్టాలు

: రైతు ప్రభాకర్‌రెడ్డి, కోనుప్పలపాడు, యాడికి మండలం



రెండెకరాల్లో ఉల్లి పంట సాగు చేశా. 400 ప్యాకెట్ల దిగుబడి వచ్చింది. ప్రస్తుతం చెన్నైమార్కెట్‌లో ఉల్లి ప్యాకెట్ ధర రూ.500 పలుకుతోంది. నాలుగు నెలల క్రితం ప్యాకెట్ ధర రూ.2,200 ఉండేది. ధర పూర్తిగా తగ్గిపోవడంతో నష్టపోతున్నాం. ప్రభుత్వమే ఆదుకోవాలి.

పెట్టుబడి ఖర్చులు కూడా కష్టమే

: రైతు రామకృష్ణ, కోనుప్పలపాడు



ఒకటిన్నర ఎకరాలో ఉల్లి పంట వేశా. ధరలు పూర్తిగా తగ్గిపోయాయి. ఈ ధరలు ఏ మాత్రం గిట్టుబాటు కావు. పండించిన పంటను నిల్వచేసుకోలేక తప్పని పరిస్థితుల్లో అమ్ముకోవాల్సి వస్తుంది. ఈ సారి పెట్టుబడి ఖర్చులు కూడా రాలేదు. ధరలు పెరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అప్పుడే రైతులకు న్యాయం జరుగుతుంది. లేదంటే ఈ సారి ఉల్లి రైతులంతా నష్టాలతో అప్పులపాలు కావల్సిందే.

పథకం ప్రకారమే శ్రీకృష్ణపై దాడి

- ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల ప్రతినిధి అక్కులప్ప

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 27: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై ముందస్తు పథకం ప్రకారమే వైసీపీ దాడిచేసిందని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప మండిపడ్డారు. మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో అక్కులప్ప మాట్లాడుతూ బహిరంగ సభ నిర్వహించాలంటే ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటారన్నారు. సీఎం దృష్టికి ప్రజా సమస్యలు తీసుకెళ్లాలన్న ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులకు నోటీసులిస్తారు. అయితే భౌతిక దాడులకు పాల్పడే వారిని ఎందుకు నిలువరించలేకపోయారని ప్రశ్నించారు. రాప్తాడులో నిర్వహించిన 'సిద్ధం' బహిరంగ సభకు ఎనిమిది జిల్లాల నుంచి ప్రజలను తరలించినప్పుడు మరింత జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా అని నిలదీశారు. బహిరంగ సభలను నిర్వహించినప్పుడు వార్తలద్వారా ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత మీడియాపై ఉంటుందని, రాజ్యాంగం కల్పించిన మీడియా హక్కులను హరిస్తూ దాడులు చేయడం ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టడమేనన్నారు. శ్రీకృష్ణపై దాడిచేసిన వారందరినీ అరెస్ట్‌చేసి జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అక్కులప్ప

ఎంటెక్, ఎంసీఏ పరీక్షా ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 27: ఎంటెక్, ఎంసీఏ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం కళాశాల కాన్ఫరెన్స్‌హాల్లో ఫలితాలను విడుదలచేసిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎంటెక్ ప్రథమ సెమిస్టర్(ఆర్21), ఎంసీఏ ప్రథమ సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్ పరీక్షలను ఫిబ్రవరిలో నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులు వారి ఫలితాలకోసం అకడమిక్ సెక్షన్ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, డీసీలు విష్ణువర్ధన్, లలిత, విభాగాధిపతులు భారతి, మమత, అజిత, భువనవిజయ, దిలీప్‌కుమార్, రామశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అధైర్యం వద్దు..అండగా ఉంటాం..

- కార్యకర్తల కుటుంబాలకు టీడీపీ నాయకుల భరోసా
- చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేత


చెక్కు అందజేస్తున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, ఫిబ్రవరి 27 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడి అరెస్టును తట్టుకోలేక మరణించిన కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా నిలుస్తోందని రాయదుర్గం నియోజకవర్గ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. కణేకల్లు మండలం గోపులాపురం గ్రామంలో చంద్రబాబు అక్రమ అరెస్టు వార్తతో మరణించిన తలారి వన్నూరప్ప కుటుంబాన్ని ఆ పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు రూ.3లక్షల చెక్కు అందజేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మండల కన్వీనర్ లాలెప్ప, బసవరాజు, బాయినేని నవీన్ పాల్గొన్నారు.

అనంతపురం అర్బన్ : చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక గుండెపోటుతో మృతి చెందిన డేరంగుల వెంకటమ్మ కుటుంబ సభ్యులకు టీడీపీ తరపున రూ.3 లక్షలు ఆర్థిక సాయం చేశారు. మంగళవారం స్థానిక అశోక్‌నగర్‌లోని వెంకటమ్మ నివాసానికి మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి కుమారుడు వైకుంఠం మధుకర్ చౌదరి వెళ్లి కుటుంబ సభ్యులకు పార్టీ అందించిన రూ.3 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు మారుతీకుమార్ గౌడ్, రామాంజనేయులు, నారాయణస్వామి యాదవ్, పరమేష్, మనోహర్, రంగా, గుండప్ప, వెంకటేశులు, సాయి కృష్ణ, మల్లికార్జున, సాయి, శంభోకర్ పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న మధుకర్ చౌదరి


నగదు అందజేస్తున్న టీడీపీ నాయకుడు హరినాథ్

గుత్తిరూరల్ : మండలంలోని బేతాపల్లి గ్రామంలో 'నిజం గెలవాలి' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సెప్టెంబరులో చంద్రబాబు అరెస్టును జీర్ణించుకోలేక గ్రామానికి చెందిన జయమ్మ (55) మృతి చెందింది. పార్టీ ఆదేశాల మేరకు మృతురాలి కుటుంబానికి రూ.3 లక్షల చెక్కు అందజేశారు. నాయకులు దిల్కా శీనా, నాగరాజు సాంబశివ, నాగేంద్ర, గోవర్దన్, రంగారెడ్డి యాదవ్, లాలు, గోవిందు, నారాయణ స్వామి, అగ్గిరాముడు, సూరి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం : టీడీపీ నేత ఉమామహేశ్వరనాయుడు ఆదేశాల మేరకు ముద్దినాయనపల్లి గ్రామంలో నాయకులు ఆర్థికసాయం అందజేశారు. నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపోటుతో మరణించిన తలారి శ్రీరాములు భార్య సాకమ్మకు రూ.3 లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కన్వీనర్ గోవిందు, నాయకులు, కార్యకర్తలకు టీడీపీ పార్టీ ఎల్లప్పుడూ అండగా వుంటుందని తెలిపారు.


ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

టెన్షన్ టెట్...!

- తొలిరోజు సాంకేతిక సమస్యలు
- అభ్యర్థులకు తప్పని ఇబ్బందులు
- 322 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 27 : ఏపీ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ తొలిరోజు కొన్ని చోట్ల అభ్యర్థులకు టెన్షన్ తప్పలేదు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా టెట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. అనంతపురం జిల్లా వ్యాప్తంగా అనంతపురం నగరం, నగర శివార్లలో 6 కేంద్రాలు, తాడిపత్రిలో 2 కేంద్రాలు, గుత్తిలో ఒక సెంటర్‌లో ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. అయితే తొలి రోజు కావడంతో అభ్యర్థుల్లో హడావుడి, టెన్షన్ నెలకొంది. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించారు. తొలి రోజు కొన్ని పరీక్షా కేంద్రాల్లో సర్వర్ సమస్య, సాంకేతిక సమస్యల కారణంగా మధ్యాహ్నం పరీక్షల్లో నిర్ణీత సమ యం కంటే...20 నిమిషాలు ఆలస్యంగా పరీక్షలు ప్రారంభమైనట్లు సమాచారం. సాంకేతిక కారణాల వల్ల అభ్యర్థుల ఫేస్ రికగ్నేషన్, ఇతర వివరాలు డౌన్‌లోడ్ ఆలస్యంగా కావడంతో...పరీక్షల ప్రారంభం ఆలస్యమైంది. అయితే నిర్ణీత స మయం వరకూ పరీక్షలు నిర్వహించడంతో అభ్యర్థులు ఊపిరి పీల్చుకున్నారు. పాఠశాల విద్య కడప ఆర్‌జేడీ రాఘవరెడ్డి జిల్లాలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 322 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 1359 మందిని పరీక్షా కేంద్రాలకు కేటాయించగా 1191 మంది హాజరు కాగా 168 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 1211 మందిని కేటాయించగా.... 154 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. అయితే తొలి రోజు గందరగోళం నెలకొంది. పరీక్షాకేంద్రాలను, అబ్జర్వర్లను, ఇతర సిబ్బందిని జిల్లా విద్యాశాఖాధికారులు కేటాయించారు. అయితే చాలా మంది ఉద్యోగులు తమకు టెట్ డ్యూటీ వేసినట్లు కూడా తెలియదని వాపోతున్నారు. కొన్ని సెంటర్లలో అనుభవం లేని సిబ్బందికి డ్యూటీలు వేయడంతో వారు....అవస్థలు పడ్డారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఎస్సీ సెక్షన్ నిర్లక్ష్యం వల్ల అభ్యర్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల నుంచి స్పందన లోపించడంతో...అభ్యర్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


పరీక్షా కేంద్రం వద్ద వేచి ఉన్న అభ్యర్థులు


పరీక్ష హాల్‌లోకి వెళ్లేందుకు క్యూలో నిల్చున్న అభ్యర్థులు



సుద్దకుంటపల్లితండాలో టీడీపీ నాయకుల ప్రచారం

బాబు గెలుపే లక్ష్యం

రామగిరి, ఫిబ్రవరి 27: టీడీపీ, చంద్రబాబు గెలుపే లక్ష్యంగా అందరం కలిసికట్టుగా పనిచేద్దామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని కుంటిమద్ది పంచాయతీ సుద్దకుంటపల్లితండాలో మంగళవారం బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రన్న ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, మాజీ జడ్పీటీసీ రామ్మూర్తినాయుడు, మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీ ప్రసాద్, మాజీ ఎంపీపీ పరందామ యాదవ్, మాదాపురం శంకర, ఎంపీటీసీ శ్రీనివాసులు, ఎస్సీసెల్ పోతన్న, మజ్జిగ అశోక్‌కుమార్, ఆనంద్, సానిపల్లి అక్కులప్ప, ఎస్టీసెల్ విజయకుమార్‌నాయక్, వెంకటేశ్‌నాయక్, మల్లెల అంజనేయులు, ఈశ్వరయ్య, నాగేంద్ర, నింబు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 27: అనంతపురం రూరల్ పరిధిలోని వాణీ కళాశాల వద్ద పాండిచ్చేరికి చెందిన రూ. 32 వేల విలువైన మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మద్యం స్వాధీనం చేసుకొని.. అతన్ని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

డిజిటల్ కీ కేటాయింపులో జాప్యం

ఆరు నెలలైనా రూరల్ తహసీల్దార్‌కు మంజూరుకాని వైనం

పనులు కాక ఇబ్బందులు పడుతున్న గ్రామీణులు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 27: అనంతపురం అర్బన్, రూరల్ మండలాలకు వేరుగా తహసీల్దార్ కార్యాలయాలు.. అధికారులను నియమించారు. ఆరు నెలల క్రితమే వేరు వేరుగా తహసీల్దార్ కార్యాల యాలనూ ఏర్పాటు చేశారు. అయితే కేవలం అర్బన్ తహసీల్దార్ సంతకం మాత్రమే చెల్లుబాటు అవుతోంది. రూరల్ తహసీల్దార్ సంతకానికి విలువలేకుండా పోయింది. అందుకు ప్రధాన కారణం... ఆ అధికారులకు వేరు.. వేరుగా డిజిటల్ కీ లు కేటాయించకపోవడమే. ఇంతవ రకు రూరల్ తహసీల్దార్‌కు డిజిటల్ కీ కేటాయిం చలేదు. ఇన్నాళ్లు అనంతపురం రూరల్ తహసీల్దార్‌గా పనిచేసిన విజయలక్ష్మికి డిజిటల్ కీ కేటాయించారు. అర్బన్ తహసీల్దార్‌గా పనిచేసిన బాలకిషన్ మ్యాన్‌వల్‌గా సంతకాలు చేసిన తరువాత వాటిని కంప్యూటర్ ఆపరేటర్లు రూరల్ తహసీల్దార్ డిజిటల్ కీతోనే అర్బన్ ప్రాంతానికి సంబంధించిన సర్టిఫికేట్లు జారీ చేసేవారు. అయితే ప్రస్తుతం ఇద్దరు అధికారులూ బదిలీపై వెళ్లిపోయారు. అనంతరం బాధ్యతలు చేపట్టిన అధికారులు వేరు.. వేరు డిజిటల్ కీ కోసం పదిరోజుల పాటు ఎదురు చూశారు. ఇందులో జాప్యం జరుగుతుండటంతో అర్బన్ తహసీల్దార్‌కు డిజిటల్ కీ కేటాయించారు. మళ్లీ రూరల్ తహసీల్దార్‌కు డిజిటల్ కీ పెండింగ్‌లో పడిపోయింది.



అనంతపురం అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలు

గ్రామీణ ప్రాంత ప్రజలకు తప్పని ఇబ్బందులు..

రూరల్ మండలం తహసీల్దార్‌కు డిజిటల్ కీ కేటాయించకపోవడంతో రూరల్ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారు. రూరల్ ప్రాంతంలో ఎక్కువగా ముటేషన్ కోసం, కుల, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఎఫ్‌ఎంబీ సర్టిఫికేట్లకు దరఖాస్తులు చేసుకున్నారు. డిజిటల్ కీ లేకపోడంతో అవి జారీ కాక ఇబ్బందులు పడుతున్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు అర్బన్ తహసీల్దార్ డిజిటల్ కీ తో జారీ చేస్తున్నప్పటికీ మిగిలినవి పెండింగ్‌లో ఉండిపోయాయి. గతంలోని అధికారులు ఇద్దరూ సమన్వయంతో ఈ పత్రాలను జారీ చేశారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా పోయింది. ఇప్పటికే రూరల్ పరిధిలో పదుల సంఖ్యలో రైతులు భూముల మార్పులు చేర్పుల కోసం ముటేషన్ చేసి ఎదురు చూస్తున్నారు. ఎన్నికల కోడ్ వస్తే... ఇక అవి నెలల తరబడి పెండింగ్‌లో ఉండిపోతాయి. ఈ విషయంపై వివరణ కోరేందుకు రూరల్ తహసీల్దార్ వెంకటనాయుడుకు ఫోన్ చేయగా.. లిఫ్ట్ చేయలేదు.

గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 27: స్థానిక జేఎన్‌టీయూ రోడ్డు ఎల్‌ఐసీ కాలనీ ఉన్న వివేకానంద ఉమెన్స్ హాస్టల్, మెస్‌ను విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. ఇంటి అవసరాలకు వినియోగించాల్సిన గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. మూడు సిలిండర్లను సీజ్ చేశారు. నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ ఫణీంద్రనాథ్‌రెడ్డి, వీఆర్వో ఖుద్దూస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 27: స్థానిక జాతీయ రహదారి కూడలిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మవరం మండలం నేలకోట తండాకు చెందిన సాలేబాయి, దేవాలానాయక్ తీవ్రంగా గాయపడ్డారు. వీరు ద్విచక్రవాహనంలో చెన్నేకొత్తపల్లికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడ్డ వారిని స్థానికులు 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రేషన్ బియ్యం పట్టివేత

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 27: కనగానపల్లి మండలం తగరకుంట సమీపంలో ఓ బొలెరా వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి మంగళవారం తెలిపారు. బియ్యం, వాహనాన్ని కనగానపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేశామని, వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

టీడీపీ నాయకుడి మృతి

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 27: మండలంలోని కొడిమి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు బ్యాళ్లగోపాల్ గుండె పోటుతో మంగళవారం మరణించారు. ఆయన మృతదేహానికి మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పాములాయి రఘు, కురుబ సాధికర కమిటీ రాష్ట్ర డైరెక్టర్ రాగే మురళి, యాదవ సాధికార సమితి రాప్తాడు నియోజకవర్గం అధ్యక్షుడు బిల్లా నాగరాజు, టీఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు బుల్లెట్ రఫీ తదితరులు నివాళులర్పించారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, ఫిబ్రవరి 27: రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఆఫీస్ ఆటోమేషన్, యోగా, బ్యూటీషియన్ కోర్సులకు గురువారం వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు ఓబిరెడ్డి, గజలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, ఆ పైన చదివిన విద్యార్థులు ఈ కోర్సులు చేయడానికి అర్హులన్నారు. ఈ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్‌లో మార్చిలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. రూ. 250 అపరాధ రుసుంతో వచ్చే నెల 2వ తేదీ వరకు తత్కాల్ కింద మార్చి 4 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని, వివరాలకు 90597 23829, 75690 33379ను సంప్రదించాలని అన్నారు.

మత్స్యసహకార సంఘం ఏర్పాటు



నగేష్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 27: స్థానిక మత్స్యశాఖ కార్యాలయంలో ఎన్నికల అధికారి పక్కీరయ్య ఆధ్వర్యంలో మత్స్యసహకార సంఘాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎం. నగేష్ (బుక్కరాయసముద్రం), వైస్ ప్రెసిడెంట్‌గా బెస్త వెంకటనారాయణ, డైరెక్టర్లుగా రాజకుమార్, గోవిందప్ప, వెంకటేష్, శీనానాయక్, బాలకృష్ణ, రామకృష్ణ, రాజేష్ నాయక్, సూర్యనారాయణ, బి. సూర్యనారాయణను ఎన్నుకున్నారు.

చీనీకాయలు టన్ను రూ.20 వేలు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 27: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20 వేలు, కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి రూ.15 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 102 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

పల్స్ పోలియోపై అవగాహన

శింగనమల, ఫిబ్రవరి 27: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమంపై మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణ, వైద్య అధికారి శంకర్ నాయక్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంఐపీ పీడీగా రఘునాథరెడ్డి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 27: ఏపీఎంఐపీ పీడీగా రఘునాథ్‌రెడ్డి నియమితులయ్యారు. ఉద్యానశాఖ ఏడీగా పనిచేస్తున్న ఆయన ఉద్యానశాఖ ఇన్‌చార్జ్‌డీడీగా కొనసాగారు. ఈ నేపథ్యంలో ఉద్యోగోన్నతిపై ఏపీఎంఐపీ పీడీగా ఆయన్ను నియమించారు. ఆయన స్థానంలో ఉద్యానశాఖ కమిషనరేట్ కార్యాలయంలో పనిచేస్తున్న ఏడీ అండాలును ఇన్‌చార్జ్ డీడీగా నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఉద్యోగోన్నతిపై బదిలీ



డాక్టర్ రమణ నాయక్

శింగనమల, ఫిబ్రవరి 27: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షణ అధికారి డాక్టర్ రమణ నాయక్.. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగోన్నతిపై అనంతపురానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనంతపురం మెడికల్ కాలేజ్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన తాను.. అదే కాలేజీకి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా వెళ్తుండటం సంతోషంగా ఉందన్నారు.

కానిస్టేబుల్‌పై పోలీసులకు ఫిర్యాదు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 27: తాను 20 ఏళ్లుగా ఉంటున్న స్థలాన్ని ఖాళీ చేయాలని బెదిరిస్తున్నాడని తాడిపత్రి కానిస్టేబుల్ రవిశంకర్‌పై మండలంలోని బసవతారక నగర్ వాసి నాగమణి మంగళవారం అనంతపురంరూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎ.నారాయ ణపురం గ్రామ సర్వేనెంబరు 14-2లో 2004లో తమకు ఇంటి పట్టా ఇచ్చారని, అయితే తాడిపత్రి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ రవిశంకర్ ఆ స్థలం తనదంటూ ఇంటిని ఖాళీ చేయాలని బెదిరిస్తున్నాడని వాపోయారు. మంగళవారం ఆ కానిస్టేబుల్ ఏకంగా జేసీబీలో ఇంటిని పడగొట్టేందుకు యత్నించాడని, తాము అడ్డుకోవడంతో వెనుతిరిగాడని విలపించింది. పోలీసు అధికారులే తనకు న్యాయం చేయాలని వేడుకుంటోంది.



పాక్షికంగా దెబ్బతిన్న ఇంటి కప్పు, బాధితురాలు నాగమణి (ఇన్‌సెట్లో)

దళితులపై వైసీపీ దౌర్జన్యాలను పట్టించుకోరా..!

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 27: దళితుల ఇంటి స్థలాలను వైసీపీ నాయకులు దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని ఎమ్మార్పీ ఎస్ నాయ కులు మండిపడ్డారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు బేకరీ గంగాధర్, రామాంజినేయులు, సూర్యనారాయణ, మల్లెల తిప్పన్న, దబ్బల శ్రీరాములు మాట్లాడారు. కురుగుంటలో దళితులకు ఇచ్చిన స్థలాలను ఎమ్మెల్యే తోపుదుర్తి సోదరుల అండతో కొందరు వైసీపీ నాయకులు కబ్జా చేయడా నికి యత్నిస్తున్నా రన్నారు. దీనిపై పలుమార్లు కలెక్టర్‌తో సహా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. దీన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ నేత బీసీ ఆర్‌దాస్ సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని స్పందనలో అధికారుల ముందే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నిం చాడ న్నారు. దీనికి అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నారాయణస్వామి



గోనుగుంట్లను సన్మానిస్తున్న నారాయణస్వామి, నాయకులు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 27: బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా తనను ఎన్నుకున్నట్లు నారాయణస్వామి యాదవ్ తెలిపారు. అనంతపురంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారని, అందులో తనకు చోటు కల్పించారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

మండ్లి కిషోర్‌కుమార్‌కు పురస్కారం



పురస్కారంతో కిషోర్‌కుమార్

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 27 : అనంతపురం నగరానికి చెందిన కవి మండ్లి కిషోర్ కుమార్‌కు అక్షర బ్రహ్మ జాతీయ పురస్కారం వరించింది. ఆల్ ద బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పలువరిని ఈ పురస్కారాలకు ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో సాహిత్యం విభాగంలో అక్షర బ్రహ్మ పురస్కారానికి ఎంపికైన కిషోర్‌కుమార్‌కు మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో జస్టిస్ డాక్టర్ చంద్రయ్య పురస్కారం అందజేశారు. కిషోర్‌కుమార్ ఈ పురస్కారాన్ని అందుకోవడంపై సీవీఆర్ పాఠశాల యాజమాన్యం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది.

వైద్య ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్‌కు 17 వినతులు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 27 : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత, ఏఓ గిరిజా మనోహరరావు వినతులు స్వీకరించారు. మొత్తం 17 వినతులు వచ్చినట్లు ఏఓ తెలిపారు.



వైద్య ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ సుజాత

మానవ వనరుల అభివృద్ధిపై శిక్షణ



ప్రశంసాపత్రాలతో శిక్షణ పొందిన అభ్యర్థులు, అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 27: స్థానిక రూడ్‌సెట్‌లో మానవ వనరుల అభివృద్ధిపై శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. నెహ్రూ యువకేంద్రం ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీనివాసులు బిసాటి భరత్, రూడ్ సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ... ఏ రంగంలోనైనా మానవ వనరుల సద్వినియోగంతోనే సత్ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం శిక్షణ పొందిన యువతకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీ తలు జీవన్‌కుమార్, ప్రణతి, జయమారుతి, రూడ్‌సెట్ శిక్షకులు ఉషారాణి, ప్రగతిపథం యూత్ అసోసియేషన్ కార్యదర్శి పవన్, తేజస్విని, గణేష్, మహేంద్ర పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను అడ్డుకున్న వలంటీర్లు

కళ్యాణదుర్గం రూరల్, ఫిబ్రవరి 27: మండల పరిధిలోని నుసికొట్టాల గ్రామ ప్రజలు తమ గ్రామానికి రోడ్లు అధ్వానంగా ఉన్నాయని టీడీపీ కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబుకు విన్నవించారు. ఆయన వెంటనే స్పందించి పనులు మొదలుపెట్టాలని తమ సిబ్బందికి సూచించారు. వెంటనే ఎక్స్‌కవేటర్లతో పనులు మొదలు పెడుతున్న సందర్భంలో ఆ గ్రామ వలంటీర్లు ఎంపీ రంగయ్య ఆదేశాల మేరకు పనులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు వలంటీర్లపై తిరగబడటంతో వారు వెనక్కి తగ్గారు. వెంటనే ఎక్స్‌కవేటర్లతో పనులు ప్రారంభించారని గ్రామస్థులు తెలిపారు.



పనులు అడ్డుకుంటున్న వలంటీర్లు

న్యాయసాధన సభ విజయవంతం: సాకే



మాట్లాడుతున్న పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 27: జిల్లా కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ నిర్వహించిన న్యాయసాధన సభ, ఎన్నికల శంఖారావం సభ విజయవం తమైందని, అందుకు సహకరించిన వారికి కృతజ్ఞతలని పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ అన్నారు. మంగళవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించినట్లు ప్రతి కుటుంబానికి రూ.5 వేలు అందేలా ఏ పార్టీ కూడా చేయని సాహసం కాంగ్రెస్ చేస్తోందన్నారు. ప్రతి కుటుంబంలోని మహిళకు ప్రతి నెలా రూ.5 వేలు అందాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర మైనార్టీ విభాగం అధ్యక్షుడు దాదాగాంధీ, జిల్లా ఉపాధ్యక్షుడు వాసు, నాయకులు అంజినేయులు, బాలక్రిష్ణ యాదవ్ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికీ హాల్ టిక్కెట్ ఇవ్వాలి



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 27: ఫీజులతో సంబంధం లేకుండా ప్రతి ఇంటర్ విద్యార్థికి యాజమాన్యాలు హాల్ టిక్కెట్లు ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆ సంఘం నాయకులు ఆర్ఐఓ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి మాట్లాడారు. కొన్ని కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల హాల్ టిక్కెట్లు ఇవ్వకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ఫీజుల కడితేనే ఇస్తామంటూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని మండిపడ్డారు. తల్లిదండ్రులకు ఫోన్లు చేసి ఫీజులు చెల్లించాలని బెదిరింపులకు దిగుతున్నాయన్నారు. ఇప్పటికైనా ఆర్ఐఓ కార్యాలయ అధికారులు స్పందించి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. అందరు విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు వచ్చేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కోశాధికారి హనుమంతు,ఉపాధ్యక్షులు వంశీ, నగర అధ్యక్షులు మంజునాథ్, ఇతర నాయకులు ఉమామహేష్, చందు, హరికృష్ణ ఆనంద్, రారాజు, అశోక్, ప్రసన్న పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోండి



జేడీకి వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 27: నగరంలోని అరవింద్‌నగర్‌లో ఉన్న ఎస్సీ నెం-4 బాలికల కాలేజీ వసతిగృహం వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి ఎస్సీ వెల్ఫేర్ జేడీ మధుసూదన్‌రావుకు వినతి పత్రం అందజేశారు. హాస్టల్‌లో పౌష్టికాహారం ఇవ్వడంలేదని, తాగునీటి సౌకర్యం లేదని, మరుగుదొడ్లకు తలుపులు లేవని, ఈ సమస్యలపై ప్రశ్నిస్తే విద్యార్థులపై వార్డెన్ కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఫిర్యాదు చేశారు. ఆ వార్డెన్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్ రజిత, కన్వీనర్ రాధ, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు శివా, భీమేష్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నార్పల, ఫిబ్రవరి 27: మండలంలోని గొల్లపల్లి గ్రామంలో పెద్దమ్మ దేవాలయ నిర్మాణానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు రూ. 10వేలను మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆలంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ధనుంజయ, గొల్లపల్లి ఎస్సీ కాలనీ వాసులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

జగన్.. ముస్లిం మైనార్టీల ద్రోహి : జనసేన

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 27: ముస్లిం, మైనార్టీలకు అమలుగాని హామీలిచ్చి.. మోసం చేసిన ఘనత జగన్‌దేనని జనసేన పార్టీ రాయలసీమ విభాగం మహిళా కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఆమె మహిళలతో మాటామంతి కార్యక్రమంలో భాగంగా గుల్జార్‌పేటలో పర్యటించి ముస్లిం మహిలలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగన్‌రెడ్డి ముస్లిం, మైనార్టీలపై అభిమానం ఉన్నట్లు నటిస్తూ... వారికందే పథకాన్నింటిని రద్దుచేసి నట్టేట ముంచాడన్నారు. దుల్హాన్ పథకంలో పాటు రంజాన్ తోఫా, విదేశీ విద్య, తత్కాల్ దుకాణ్ మకాన్, ఇస్లామిక్ బ్యాంకు పథకాలకు మంగళం పాడి ఆ వర్గాలను మోసం చేశారన్నారు. ప్రతి నియోజకర్గానికి షాదీఖానా హామీ మరిచారన్నారు. హజ్ యాత్రకు అందిస్తానన్న ఆర్థికసాయాన్ని అటకెక్కించారన్నారు. ఇలా ఎటు చూసినా ముస్లిం, మైనార్టీలు అన్యాయానికి గురయ్యారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నిక ల్లో ముస్లిం, మైనార్టీలు జనసేన, టీడీపీలకు ఓటేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి పెండ్యాల చక్రపాణి, టీడీపీ 18వ వార్డు ఇన్‌చార్జ్ ముస్తఖాన్, వీర మహిళలు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న పెండ్యాల శ్రీలత

ఓటరు జాబితాపై సమీక్ష

శింగనమల, ఫిబ్రవరి 27: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీను వెన్నెల నియోజకవర్గంలోని రాజకీయపార్టీల నాయకులతో ఓటర్ల జాబితా, ఎన్నికలపై మంగళవారం సమావేశం నిర్వహించారు. టీడీపీ, సీపీం, సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో చనిపోయిన వారి ఓట్లు, డబుల్, త్రిబుల్ ఓట్లు, డోర్ నెంబర్లు తప్పలు ఉన్నాయని, వాటిని తొలగించాలని గతంలో ఫిర్యాదు చేసినా తొలగించలేదన్నారు. ఓటరు జాబితా మార్పులు చేర్పులు విషయంలో వలంటరీల జోక్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ... నియోజకవర్గంలో ఓటరు జాబితాలో తప్పులుంటే తమ దృష్టికి తీసుకొనిరావాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హనుమంతరెడ్డి, వెంకటేశ్, ఆదినారాయణ, బోయసత్తి, శంకర్ బోయ అక్బర్, రాముడు, సీపీఐ చిన్నన్నప్పయాద్, సీపీఎం ఓనల్లప్ప, మధుయాదవ్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, ప్రకాశ్‌రావు, ఉదయ్ పాల్గొన్నారు.

జాగరణ మహోత్సవాన్ని జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 27: మహాశివరాత్రిని పురస్కరించుకుని మార్చి 8న స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాగరణ మహోత్సవంలో భక్తులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని పరిషత్ సభ్యుడు శ్రీపాద వేణు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం టీటీడీ కల్యాణమండపంలో జాగరణ మహోత్సవ బ్రోచర్లను ఆవిష్కరించారు. 8న సాయంత్రం 5 నుంచి 9వ తేదీ తెల్లవారుజాము 5 గంటల వరకు జాగరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాగరణ మహోత్సవంలో పాలొనే భక్తుల కు ఆధ్యాత్మిక ప్రశ్నల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. అదేవిధంగా శివలింగానికి అభిషేకాలు నిర్వహించడంతో పాటు అభి షేకంలో పాల్గొన్న భక్తులకు పంచముఖ రుద్రాక్షలు, వార ణాసి నుంచి తీసుకువచ్చిన కాలభైరవ కంకణాలు అందజే స్తామన్నారు. అదే కార్యక్రమంలో లాటరీ పద్ధతిలో ఎంపికైనవారికి శ్రీశైల క్షేత్ర దర్శనం ఉచితంగా కల్పిస్తామన్నారు. ఈ మహోత్సవంలో పాల్గొనదలచినవారు మార్చి 6 లోపు 94923 25020, 80193 81267 నెంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పరిషత్ సభ్యులు నాగేశ్వరి, సాయిరాం, మధు, వెంకటాద్రి, టీటీడీ ప్రోగ్రామ్ అసిస్టెంట్ బాబు, పండిట్ వేణు పాల్గొన్నారు.



జాగరణ మహోత్సవ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న సభ్యులు

కాలవ గెలవాలని దుర్గమ్మకు పూజలు



కనకదుర్గమ్మ సన్నిధిలో టీడీపీ నాయకులు

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 27: మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు మరోసారి రాయదుర్గం తెలుగుదేశం ఎమ్మెల్యేగా గెలుపొంది చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని మంగళవారం విజయవాడలో కనకదుర్గమ్మకు టీడీపీ నాయకులు పూజలు నిర్వహించారు. కాలవ శ్రీనివాసులుకు టిక్కెట్ రావాలని మొక్కుకున్నామని, అది నెరవేరిందన్నారు. తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండాపురం కేశవరెడ్డి, మండల కన్వీనర్ బలరాంరెడ్డి, యర్రగుంట్ల వెంకటేశులు, నాగరాజు, కావలి రాము మంగళవారం విజయవాడలోని కనకదుర్గమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రెండు నెలల్లో జరిగే ఎన్నికల్లో కాలవ శ్రీనివాసులు ఎమ్మెల్యేగా గెలిచి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని అమ్మవారిని వేడుకున్నట్లు వారు తెలిపారు.

సురక్షిత నీటిని అందించడమే లక్ష్యం



హరేసముద్రంలో ఆర్వో ప్లాంటును ప్రారంభిస్తున్న జిందాల్ యాజమాన్యం

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 27: గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించడమే లక్ష్యమని జిందాల్ సాప్ యూనిట్ హెడ్, ప్రెసిడెంట్ సౌమ్యజ్యోతి సర్కార్ అన్నారు. మంగళవారం మండలంలోని హరేసముద్రం గ్రామంలో ఉన్న జిందాల్ సాప్ లిమిటెడ్ యాజమాన్యం హరేసముద్రం, బొల్లనగుడ్డం గ్రామాలకు ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఒక్కో గ్రామానికి రూ.10 లక్షల వ్యయంతో ప్లాంట్లను ఏర్పాటు చేశారు. కర్మాగార యాజమాన్యం గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షిత నీటిని అందించి వారు ఆరోగ్యంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిందాల్ బీఎఫ్ ఆపరేషన్ హెడ్ మాధవన్‌కుమార్, లీగల్ లైజన్ హెడ్ సుభాని, హెడ్ హెచ్ఆర్ రవికుమార్, సర్పంచులు తిప్పేస్వామి, గాదిలింగ, యాజమాన్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను అడ్డుకున్న వలంటీర్లు



పనులు అడ్డుకుంటున్న వలంటీర్లు

కళ్యాణదుర్గం రూరల్, ఫిబ్రవరి 27: మండల పరిధిలోని నుసికొట్టాల గ్రామ ప్రజలు తమ గ్రామానికి రోడ్లు అధ్వానంగా ఉన్నాయని టీడీపీ కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబుకు విన్నవించారు. ఆయన వెంటనే స్పందించి పనులు మొదలు పెట్టాలని తమ సిబ్బందికి సూచించారు. వెంటనే ఎక్స్‌కవేటర్లతో పనులు మొదలు పెడుతున్న సందర్భంలో ఆ గ్రామ వలంటీర్లు ఎంపీ రంగయ్య ఆదేశాల మేరకు పనులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు వలంటీర్లపై తిరగబడటంతో వారు వెనక్కి తగ్గారు. వెంటనే ఎక్స్‌కవేటర్లతో పనులు ప్రారంభించారని గ్రామస్థులు తెలిపారు.

దాడి చేశారని ఫిర్యాదు

యాడికి, ఫిబ్రవరి 27: నా పొలంలో పంటపై గొర్రెలను వదిలి ఎందుకు మేపారని ప్రశ్నించినందుకు యుగంధర్‌రెడ్డి అనే వ్యక్తిపై దాడిచేసిన సంఘటనలో బోయరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఐదుమందిపై కేసు నమోదుచేసినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. యాడికి మండలం వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన యుగంధర్‌రెడ్డి తనకున్న మూడెకరాల పొలంలో ఆవాలు పంట సాగుచేశాడు. బోయరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొందరు గొర్రెల కాపరులు కొద్దిమేరకు ఆవాలు పంటను మేపారు. పంటలోకి గొర్రెలను ఎలా వదులుతారని యుగంధర్‌రెడ్డి కాపరులను మందలించాడు. దీంతో కొందరు గొర్రెల కాపరులు, మరో ఇద్దరు వ్యక్తులు తనపై దాడిచేసి గాయపరిచారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదుమేరకు బోయరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పెద్దయ్య, యల్లయ్య, రాంమోహన్, వేణు, రామకృష్ణలపై కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

జూదరుల అరెస్టు

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 27: మండలంలోని మల్లాపురం గ్రామ సమీపంలో పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మల్లాపురం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పట్టణ పోలీసులు దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ. 11,300 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు పంపుతామన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తాడిపత్రి టౌన్, ఫిబ్రవరి 27: మండలంలోని ఊరుచింతల గ్రామానికి చెందిన రుద్రాదేవి(26) అనంతపురంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందిందని రూరల్ పోలీసులు తెలిపారు. అనారోగ్య కారణాలతో రుద్రాదేవి మూడురోజులక్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. మృతురాలికి భర్త మహేష్‌తోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

శింగవరంలో స్వల్ప ఘర్షణ

యల్లనూరు, ఫిబ్రవరి 27: మండలంలోని శింగవరం గ్రామంలో మంగళవారం సాయంత్రం అన్నదమ్ముల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుందని ఏఎస్ఐ సంపత్ తెలిపారు. అన్నదమ్ములైన రియాజ్, ఉస్మాన్ పాత విషయాలపై ఇరువురు గొడవపడ్డారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మామిడికాయల అపహరణపై ఫిర్యాదు

పెద్దవడుగూరు, ఫిబ్రవరి 27: మండలంలోని చిత్రచేడు గ్రామానికి చెందిన రైతు మునీంద్ర తోటలో గుర్తుతెలియని వ్యక్తులు మామిడికాయలు అపహరించారని బాధితుని ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. మునీంద్ర తనకున్న రెండెకరాల పొలంలో మామిడిచెట్లు సాగుచేశాడు. మంగళవారం ఉదయం తోటకు వెళ్లి పరిశీలించగా 30 చెట్లకు ఉన్న కాయలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, ఎస్ఐ శ్రీనివాసులు పొలాన్ని పరిశీలించారు.

పశుగ్రాసం దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 27: మండలంలోని దర్గాహోన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న వన్నళ్లి గ్రామ శివారులో ఉన్న పశుగ్రాసం దగ్ధమైంది. వీఆర్‌ఓ రామన్న తెలిపిన మేరకు గ్రామానికి చెందిన హెచ్ నాగరాజు అనే రైతుకు చెందిన ఐదు ఎకరాల పశుగ్రాసాన్ని గడ్డివాముగా వేసుకున్నారు. సాయంత్రం వేళలో అకస్మాత్తుగా గడ్డివాముకు నిప్పు అంటుకుంది. స్థానికులందరూ మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా అదుపులోకి రాలేదు. ఉరవకొండ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. దీంతో పశుగ్రాసం దగ్ధమై రూ.35 వేలు వరకు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపినట్లు వీఆర్వో అన్నారు. బాధితుల సమాచారం నివేదిక తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు.

టీడీపీతోనే బడుగులకు న్యాయం: కాలవ



13వ వార్డులో పర్యటిస్తున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, ఫిబ్రవరి 27: తెలుగుదేశం పాలనతోనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని టీడీపీ రాయదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం ఆయన పట్టణంలోని 13వ వార్డు నారా చంద్రబాబునాయుడు కాలనీలో విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాల గురించి ఇంటింటికి వివరించారు. ఆయన మాట్లాడుతూ రాయదుర్గం నియోజకవర్గంలో తాను ఏ గ్రామంలో పర్యటించినా ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. ముఖ్యంగా పట్టణంలో జనాదరణ అపురూపంగా ఉందన్నారు. పట్టణ ఓటర్లు తనకు 15 వేలకు పైగా మెజార్టీ ఇచ్చి గెలిపిస్తారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు, రాయదుర్గంలో కాలవ శ్రీనివాసులు గెలవాలనే దృఢమైన సంకల్పం అన్ని వర్గాల ప్రజల నుంచి వ్యక్తమవుతోందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో భర్త మరణించిన తనకు వితంతు పింఛన్ మంజూరు చేస్తే వైసీపీ సర్కారు అన్యాయంగా తొలగించిందని ఓ మహిళ కాలవతో ఆవేదన వ్యక్తం చేసింది. టీడీపీ కంచుకోటను బద్దలు కొడతానని మెట్టు గోవిందరెడ్డి గొప్పలకు పోతున్నాడని కాలవ విమర్శించారు. అసమర్థుడైన వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డిపై 50 వేల మెజార్టీతో గెలుస్తానని కాలవ ధీమా వ్యక్తం చేశారు. జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు కరేగౌడ మంజునాథ, వార్డు ఇన్‌చార్జి నాగరాజునాయక్, పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మాజీ కౌన్సిలర్లు టంకశాల హనుమంతు, పొరాళ్ల పురుషోత్తం, గాజుల వెంకటేశులు, కడ్డిపూడి మహబూబ్‌బాషా, పూజారి శివ, బండి చిన్న, ఇనాయత్, కొండాపురం శ్రీరాములు, జిలాన్, ఎస్సీ సెల్ మల్లి, ప్రహ్లాద ఏటూరు కుమార్, రావుత్ రాజశేఖర్ పాల్గొన్నారు.

గొడవలకు దిగితే కఠిన చర్యలు: డీఎస్పీ



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ గంగయ్య

పెద్దవడుగూరు, ఫిబ్రవరి 27: గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని తాడిపత్రి డీఎస్పీ గంగయ్య హెచ్చరించారు. మండలంలోని చిన్నవడుగూరు గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. గ్రామస్థులతో డీఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసి సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఆయన వెంట ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, సీఐ రోషన్, ఎస్ఐ శ్రీనివాసులు ఉన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో ఉద్యోగాలకు ఎంపిక

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 27: పట్టణంలోని శ్రీశంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన కూల్ క్యాంపస్ డ్రైవ్‌లో 8మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్, ప్రిన్సిపాల్ గోపాల్ తెలిపారు. వారు మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన ప్రముఖ ఆల్‌సెక్ టెక్నాలజీస్ సంస్థ ఆధ్వర్యంలో క్యాంపస్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఫైనల్ ఇయర్‌కు చెందిన 8 మంది విద్యార్థులు ఎంపికైనట్లు వారు తెలిపారు. విద్యార్థులకు ఉపాధి కల్పించే విధంగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు అభినందించారు. హెచ్‌ఆర్ మేనేజర్ రోషన్, కెరియర్ ప్రమోషన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వరప్రసాద్, పరిపాలన అధికారి డాక్టర్ చంద్రశేఖర్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్‌బాబు, ప్రజా సంబంధాల అధికారి బసెట్టి క్రిష్ణయ్య, శిక్షణాధికారి రాకేష్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

యాడికి, ఫిబ్రవరి 27: ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం సెబ్ అధికారులు సీజ్‌చేశారు. పోలీసులు తెలిపిన వివరాలమేరకు వేములపాడు జాతీయ రహదారిపై ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించి సెబ్ అధికారులు సీజ్‌చేశారు. సీజ్ చేసిన ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ట్రాక్టర్ స్వాధీనం

రాయదుర్గం, ఫిబ్రవరి 27: ఎలాంటి అనుమతులు లేకుండా వేదవతి హగరి నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు మంగళవారం సీఐ శ్రీనివాసులు తెలిపారు. గుమ్మఘట్ట మండలం భూపసముద్రం గ్రామ సమీపంలోని వేదవతి హగరి నుంచి భూపసముద్రం గ్రామానికి చెందిన వ్యక్తి ఇసుకను తరలిస్తుండగా రాయదుర్గం పట్టణ సమీపంలో ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. రూ.20 వేలు అపరాధ రుసుం చెల్లించిన అనంతరం వదిలేసినట్లు పోలీసులు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌గా కిషోర్

రాయదుర్గంటౌన్, ఫిబ్రవరి 27: రాయదుర్గం మున్సిపల్ కమిషనర్‌గా కిషోర్‌ను నియమిస్తూ ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న కిషోర్‌ను రాయదుర్గంకు బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ షేక్‌మాలిక్‌ను డీఎంఏ ఆఫీసులో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు.

తాడిపత్రి మున్సిపల్ కమిషనర్ బదిలీ

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 27: స్థానిక మున్సిపల్ కమిషనర్ రవి బదిలీ అయ్యారు. ఎన్నికల నేపథ్యంలో భాగంగా ఆయన బదిలీపై ఆముదాలవలసకు బదిలీ అయ్యారు. ఈ స్థానంలో నరసారావుపేట నుంచి నూతన కమిషనర్‌గా రాంమోహన్ రానున్నట్లు అధికారులు తెలిపారు.

శివుడికి ప్రత్యేక పూజలు



అన్నదానం చేస్తున్న శివస్వాములు

పెద్దవడుగూరు, ఫిబ్రవరి 27: మండలకేంద్రంలోని పేట ఉమామహేశ్వరస్వామి ఆలయంలో గ్రామోత్సవం పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి వివిధ పూలతో విశేషంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

200 రోజులు పనిదినాలు కల్పించాలి

పుట్లూరు, ఫిబ్రవరి 27: ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలకు 200రోజులు పనిదినాలు కల్పించాలని మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు కల్పించి రూ.600 కూలి చెల్లించాలన్నారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని పనుల వద్ద టెంటు, మెడికల్‌కిట్లు, మజ్జిగ, తాగునీరు ఏర్పాటుచేయాలన్నారు. ఉరవకొండలో ఉపాధికూలీల వాహనం ప్రమాదానికి గురికావడంతో 40మంది గాయాలపాలయ్యారని వీరికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్దయ్య, వెంకటచౌదరి, భాస్కర్‌రెడ్డి, నాగభూషణం, రంగడు, లక్ష్మయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పునర్విభజన హామీల సాధనకు కాంగ్రెస్ పోరాటం

కణేకల్లు, ఫిబ్రవరి 27: రాష్ట్ర పునర్విభజన హామీల సాధనకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు కే మహబూబ్‌బాషా అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు.

కళ్యాణదుర్గంరూరల్: గృహిణులకు ప్రతి నెల రూ.5 వేలు కాంగ్రెస్ పార్టీ అందిస్తుందని రాష్ట్ర అధికార ప్రతినిధి రాంభూపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆ పార్టీనాయకుడు మాల ఎర్రిస్వామి ఇంటి ఆవరణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సోమవారం అనంతపురంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఎన్నికల ప్రచార సభ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. తిమ్మప్ప, సీవీ చౌదరి, ఈరన్న, మల్లయ్య, క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.


ఉరవకొండ: అనంతపురంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ సాధన సభ విజయవంతమైందని నియోజకవర్గ ఇన్‌చార్జి రామానాయుడు అన్నారు. పట్టణంలోని సత్యం కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలోకి షర్మిల రాకతో కార్యకర్తలు నూతనోత్సాహాన్ని నింపిందన్నారు. రాము, అబ్బాస్, ఓబులేసు, నారాయణస్వామి, రాముడు, హరి, కుమారుస్వామి పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మండల సమావేశం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 27: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మాధవి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. సమావేశానికి ఏడుగురు ఎంపీటీసీలు, కేవలం ఒక్క సర్పంచు మాత్రమే హాజరయ్యారు. మూడు నెలలకొకసారి జరిగే సమావేశంలో సమస్యలను పరిష్కరించకపోతే సమావేశాలెందుకని ఎంపీటీసీలు అధికారులను ప్రశ్నించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీడీఓ వెంకటరమణప్ప, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తిన్నాడు.. వెళ్లిపోయాడు !

- బదిలీపై వెళ్లిన తహసీల్దార్ అవినీతి బాగోతం
- రీ సర్వే డబ్బులన్నీ సొంతానికే
- అడిగిన సిబ్బందిపై మండిపాటు
- డబ్బులివ్వకుంటే సంతకాల్లో తిరకాసు
- కర్ణాటక వారికి కూడా పట్టాలిచ్చిన అధికారి



కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 27: ప్రజా ప్రయోజనం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన లక్షల రూపాయాలను నియోజకవర్గంలోని ఓ మండల తహసీల్దారు సొంతానికి వాడేసుకున్నాడు. ఆ అధికారి అవినీతిపై చర్చ జరుగుతున్న సమయంలో ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆ మండలం నుంచి వెళ్లిపోయాడు. దీనిపై ఆ మండలంలో తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

డబ్బులడిగితే కిందిస్థాయి సిబ్బందిపై చిందులు

ఆ మండల కేంద్రం పరిధిలోని ఓ పంచాయతీలో రీ సర్వేకు ప్రభుత్వం రూ. 19 లక్షలు మంజూరు చేసింది. రీ సర్వేలో రాళ్ల ఏర్పాటు, ఇతర ఖర్చులకు ఆ నిధులను వాడుకోవాలి. తహసీల్దారు పేరు మీద ఆ డబ్బులు మంజూరు చేశారు. అయితే ఆ తహసీల్దారు మాత్రం రీ సర్వేకు డబ్బులు వాడుకోకుండా తన సొంతానికి వాడుకున్నట్లు సమాచారం. రీ సర్వే డబ్బులు ఇవ్వండి అంటూ ఆ పంచాయతీ రీ సర్వే ఆర్ఐ, వీఆర్‌వో, వీలేజ్ సర్వేయర్, మండల సర్వేయర్, గ్రామ నౌకరు వెళ్లి అడిగితే...వారిపై చిందులు తొక్కారు. చివరికీ కొద్దో...గొప్పో...సిబ్బందికి ఇచ్చి ఆ తహసీల్దారు చేతులు దులుపుకున్నాడు. సిబ్బంది ఈ విషయాన్ని ఎవరికి చెప్పుకోవాలో తెలియక, సతమతం అవుతూ సొంత డబ్బులు పెట్టి రీ సర్వే చేశారు.

డబ్బులిస్తే ఒకలా.. లేకుంటే మరోలా

కాగా ఆ తహసీల్దారు డబ్బులిస్తే ఒకలా.. ఇవ్వకుంటే మరోలా సంతకం చేస్తాడు. రీ సర్వే డబ్బులు డ్రా చేయడానికి తహసీల్దారు సంతకంతో కూడిన చెక్‌ను బ్యాంక్ అధికారులకు పంపించారు. ఆ బ్యాంక్ అధికారులకు చెక్‌మీద ఉన్న సంతకం చూసి అనుమానం వచ్చింది. ఇదీ తహసీల్దారు సంతకమా కాదా అంటూ అనుమానాలు రేకెత్తాయి. దీంతో వారు తహసీల్దారుకు ఫోన్ చేసి బ్యాంక్‌కు రమ్మని చెప్పారు. బ్యాంక్ అధికారుల ఎదుటే మరోసారి ఆ చెక్ మీద ఆ తహసీల్దారు సంతకం పెట్టిన తర్వాతనే ఆ డబ్బులను డ్రా చేసి ఇచ్చినట్లు తెలిసింది. ఇలా ఒక్కటి కాదు చాలా ఫైళ్లు అన్నీ రిజెక్ట్ అయ్యే విధంగా సంతకాలు చేయడంలో ఆ తహసీల్దారు దిట్ట అని ఆ కార్యాలయంలోని సిబ్బందే ఆరోపిస్తున్నారు. దాంతో పాటు రెవెన్యూ ఉన్నతాధికారులకు పంపించిన గ్రామకంఠం ఫైళ్లల్లో కూడా ఆ తహసీల్దారు ఇష్టానుసారంగా సంతకం చేసి పంపించేశారు. ఉన్నతాధికారులకు అనుమానం వచ్చి ఇదీ మీ సంతకమేనా అంటూ ఆ తహసీల్దారుకు ఫోన్ చేసి మరోసారి పరిశీలన చేసుకున్నారు. ఇక చుక్కల భూములకు సంబంధించిన ఫైళ్ల విషయంలో ఆ తహసీల్దారు రైతులకు చుక్కలు చూపించాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో ఓ రైతుకు సంబంధించిన చుక్కల భూముల ఫైళ్లల్లో 23 సంతకాలు ఆ తహసీల్దారు ఇష్టానుసారంగా చేయడంతో ఉన్నతాధికారులు ఆ ఫైల్‌లో చేసిన సంతకాలు చూసి అనుమానంతో దాన్ని రిజెక్ట్ చేసేశారు. ఇలా ఒక్కటి కాదు..రెండు కాదు...చాలా ఫైళ్లలో సంతకాలు తేడాగా చేస్తూ రిజెక్ట్ అయ్యేలా చేశాడు.

నిబంధనలకు విరుద్ధంగా పట్టాదారు పుస్తకాలు

ఇక వెబ్‌ల్యాండ్ విషయానికి వస్తే అంతూ పొంతు లేకుండా ఎలాపడితే అలా పట్టాదారు పాసుపుస్తకాలు చేసేశాడు. నిబంధనలకు విరుద్ధంగా పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేశారు. డబ్బులిస్తే డీ-పట్టాల భూములు కూడా ఎడాపెడా లేకుండా చేసేశారు. ఈ విషయంలో ఆ తహసీల్దారు, ఆర్ఐ కుమ్మక్కైనట్లు తెలిసింది. పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయడం ద్వారా వచ్చిన అక్రమ సంపాదన వాటాల్లో తేడాలు రావడంతో ఆ తహసీల్దారు, ఆర్ఐ కార్యాలయంలోనే వాదులాడుకున్నట్లు తెలిసింది. చివరికి వారిద్దరు కార్యాలయానికి రాకుండా ఉండిపోయారు.

ఇబ్బడి ముబ్బడిగా ఇంటి పట్టాలు

జగనన్న లే అవుట్‌లో అయితే ఇంటి పట్టాలు ఇబ్బడిముబ్బడిగా ఇచ్చేశారు. డబ్బులిస్తే చాలు కర్ణాటక ప్రాంతానికి చెందిన వారికి కూడా పట్టాలు ఇచ్చారు. అంటే ఇక ఏ స్థాయిలో డబ్బులు చేతులు మారాయో అర్థం చేసుకోవచ్చు. ఏ మాత్రం విచారణ చేయకుండా డబ్బులకు తలొగ్గి ఇంటి పట్టాలను అనర్హులకు ఇచ్చారన్న ఆరోపణలు ఆ తహసీల్దార్‌పై బలంగా వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వెబ్‌ల్యాండ్, జగనన్న లే అవుట్‌లో మంజూరు చేసిన ఇంటి పట్టాలు, కార్యాలయంలో నిధుల దుర్వినియోగంపై సమగ్రంగా విచారణ చేపడితే అసలు విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

మా దృష్టికి రాలేదు: రాణి సుస్మిత, ఆర్డీవో, కళ్యాణదుర్గం

ఆ తహసీల్దారు అక్రమాలకు పాల్పడినట్లు మాకు ఇంతవరకూ ఎలాంటి ఫిర్యాదు అందలేదు. జగనన్న లే అవుట్‌లో కర్ణాటక వాసులకు ఇంటి పట్టాల మంజూరు విషయం నా దృష్టికి రాలేదు. అలాంటిది ఏమైనా ఉంటే ఎవరైనా ఆధారాలతో ఫిర్యాదు చేయవచ్చు. విచారించి తప్పకుండా చర్యలు తీసుకుంటాం. రీ సర్వే నిధులు వినియోగం విషయంపై ఎవరూ ఫిర్యాదు చేయలేదు. ఏదేమైనా అన్ని విషయాలను విచారించి చర్యలు తీసుకుంటాం.

టీడీపీ హయాంలోనే భవన కార్మికులకు ప్రాధాన్యం



పయ్యావుల శ్రీనివాసులును సన్మానిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ఉరవకొండ, ఫిబ్రవరి 27: టీడీపీ హయాంలోనే భవన నిర్మాణ కార్మికులకు ప్రాధాన్యం ఇచ్చినట్లు టీడీపీ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు అన్నారు. పట్టణంలో మంగళవారం భవన నిర్మాణ కార్మికులతో ఆయనసమావేశం అయ్యారు. కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. నాయకులు రామాంజనేయులు, శివశంకర్, బేల్దారి బాషా, బుడేన్ పాల్గొన్నారు.

సెపక్‌తక్రా పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీఈటీలు

ఉరవకొండ, ఫిబ్రవరి 27: పట్టణంలోని మహేశ్వరి ఇంగ్లీషు మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికయ్యారు. 24, 25 తేదీల్లో నెల్లూరు జిల్లా ముక్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొన్నారు. సబ్ జూనియర్ విభాగంలో తేజ, ఎలిజబెత్, జూనియర్ విభాగంలో మోసెస్, వంశీ ఎంపికైనట్లు పీఈటీ ఎర్రిస్వామి తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపికావడం పట్ల హెచ్‌ఎం సునంద హర్షం వ్యక్తం చేశారు.

షూటింగ్ బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభచూపిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 27: షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 42వ జాతీయస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో పట్టణంలోని త్రిబుల్‌ఎస్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ మంగళవారం తెలిపారు. జూనియర్స్ విభాగంలో షాషావలి, సమీర్ విజేతలుగా నిలిచారన్నారు. సబ్ జూనియర్ విభాగంలో వరదరాజులు, సుధీర్ రన్నర్స్‌గా నిలిచారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు, పీఈటీలు అభినందించారు.

ప్రతి విద్యార్థికి హాల్‌టిక్కెట్లు ఇవ్వాలి



ఆర్డీవో కార్యాలయ ఏవోకి వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 27: ప్రతి విద్యార్థికి ఏ షరతులు లేకుండా హాల్ టిక్కెట్లు ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం ఏవోకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజు కట్టలేదని సాకుతో హాల్ టిక్కెట్లు ఇవ్వడం లేదని ఇటువంటి పద్ధతి మార్చుకోకపోతే గుణపాఠం తప్పదన్నారు. ఏఐఎస్ఎఫ్ పట్టణ ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్, ఉపాధ్యక్షులు శ్రీను, భరత్, సహాయ కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజ స్థాపనకు కృషి

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 27: గ్రామాల్లో పోలియో రహిత సమాజ స్థాపనకు నడుం బిగిద్దాం అని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారిణి గీతాభార్గవి, కుమారరాజా అన్నారు. మండలంలోని శ్రీధరఘట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మార్చి 3న జాతీయ స్థాయిలో పల్స్‌పోలియో నిర్వహిస్తున్నామన్నారు. పీహెచ్‌సీ పరిధిలో 5 సంవత్సరాల్లోపు పిల్లలు 2814 మంది ఉన్నారని, వీరందరికీ పోలియోచుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, ఎంపీహెచ్ఓ శివప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ ఉమాదేవి, బాలాజీ పాల్గొన్నారు.

జీడిపల్లి రిజర్వాయరులో 0.472 టీఎంసీల నీటినిల్వ

బెళుగుప్ప, ఫిబ్రవరి 27: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో ప్రస్తుతం 0.472 టీఎంసీల నీటి నిల్వ వున్నట్లు మంగళవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో ఇన్‌ఫ్లో 578 క్యూసెక్కులు వుండగా, ఫేజ్-2కు ఔట్ ఫ్లో కింద 600 క్యూసెక్కులు వెళుతోందని వారు వెల్లడించారు.

బండిమోటు వేలం నిర్వహణ

రాయదుర్గం, ఫిబ్రవరి 27: మండలంలోని 74 ఉడేగోళం గ్రామ సమీపంలో వెలసిన మద్దానేశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవం జాతర నిర్వహణలో భాగంగా మంగళవారం బండిమోటు కార్యక్రమం నిర్వహించినట్లు ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. మద్దానేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బసవరాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి రూ.37 వేలు వేలం పాడి సొంతం చేసుకున్నట్లు తెలిపారు. గత ఏడాది రూ. 36 వేలు పాడగా రూ. వెయ్యిలు అదనంగా వచ్చినట్లు తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రాణి జితేందర్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోండి

రాయదుర్గం టౌన్, ఫిబ్రవరి 27: పట్టణంలో రాత్రివేళల్లో వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ శ్రీలక్ష్మి, గోవిందరాజులు కోరారు. పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ సమావేశ భవనంలో చైర్‌పర్సన్ శిల్ప అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. అజెండాలోని 8వ అంశాన్ని వాయిదా వేశారు. మిగిలిన అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. కౌన్సిలర్లు శ్రీలక్ష్మి, గోవిందరాజులు మాట్లాడారు. వీధిదీపాల సమస్యలను పరిష్కరించాలని పదే పదే కోరుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని మండిపడ్డారు. సమస్యలు పరిష్కారం కానపుడు ప్రజలు పాలకులనే నిలదీస్తారే తప్ప అధికారులను ప్రశ్నించరని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ షేక్‌మాలిక్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.